

సీజ్ చేసి ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అక్రమ నిర్మాణం సీజ్

సైదాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి): గత నెల 18న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'కూల్చివేసినా... తిరిగి కొనసాగుతున్న సెల్లార్ నిర్మాణ పనులు' అనే కథనానికి స్పందించిన జీహెచ్ఎంసీ అధికారులు మంగళవారం అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేశారు. కనీస భద్రతా ప్రమాణాలు పాటించకుండా చేపడుతున్న అక్రమ సెల్లార్ నిర్మాణంపై కాలనీవాసులు సంతోష్‌నగర్ సర్కిల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా నేతల ఒత్తిడితో టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించలేదు. చివరకు 'ఆంధ్రజ్యోతి' కథనంతో అధికారులు నోటీసులు జారీ చేశారు. అయినా నిర్మాణ పనులు ఆపేయకపోవడంతో సెక్షన్ 461-ఏ ఆఫ్ జీహెచ్ఎంసీ యాక్ట్ 1956 కింద మంగళవారం అధికారులు సీజ్ చేశారు.

వైద్యుల సేవలు అభినందనీయం : లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): సేవాదృక్పథంతో వైద్యులు చేస్తున్న సేవలు అభినందనీయమని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం డాక్టర్స్ డే, జాతీయ చార్టెడ్ అకౌంట్స్ డేలను లయన్స్ క్లబ్ ఆఫ్ వనస్థలిపురం 320 హెచ్, జేసీఐ హైదరాబాద్ ఫినిక్స్ ఆధ్వర్యంలో వనస్థలిపురంలోని గణేశ్ కాన్ఫరెన్స్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి, వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ టి.మహేష్ ముఖ్య అతిథులుగా హాజరై నిస్వార్థంగా వైద్యసేవలు అందిస్తున్న 40 మంది వైద్యులు, చార్టెడ్ అకౌంటెంట్స్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ వనస్థలిపురం అధ్యక్షులు నందకిషోర్, కార్యదర్శి రవీందర్ రెడ్డి, ఖజానాదారు నరసింహులు, ఉపాధ్యక్షులు భావన శ్రీనివాస్, జోన్ చైర్మన్ దూరయ్య, మల్లికార్జున్, సువిద, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణకారుల సమస్యలను పరిష్కరించాలి : రాఘవాచారి

చంపాపేట, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలంగాణ ప్రభుత్వం పరిష్కరించాలని రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి డిమాండ్ చేశారు. చంపాపేట డివిజన్ సాయిరాంనగర్ కాలనీలోని రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాఘవాచారి మాట్లాడుతూ స్వర్ణకారుల కోసం తక్షణమే సంక్షేమ(వెల్ఫేర్) బోర్డు ఏర్పాటు చేయాలని, జీవో నెంబర్ 272ను సవరణ చేయాలని, 50సంవత్సరాలు నిండిన స్వర్ణకారులకు పెన్షన్‌లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. స్వర్ణకారుల వృత్తిని కోల్పోయిన వారికి ప్రభుత్వం వృత్తి పరంగా పని కల్పించాలని, వృత్తి పనిలేక అప్పులతో ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని రాఘవాచారి కోరారు. ఈ సమావేశంలో స్వర్ణకార సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు గౌరోజు రత్నమాచారి, ఉపాధ్యక్షుడు లక్ష్మణాచారి, కార్యదర్శులు ఆర్.సతీష్‌చారి, వి.వెంకటాచారి, ప్రచార కార్యదర్శులు పి.రమేష్‌చారి, పోతులూరి చారి, నాగరాజుచారి, రాజనర్సింహ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో దివ్యాంగులకు ప్రాతినిథ్యం కల్పించాలి

ఓల్డ్‌మలక్‌పేట జూలై 1(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు ప్రాతినిథ్యం కల్పించాలని వికలాంగ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను బంజారాహిల్స్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో మంగళవారం వారు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వికలాంగుల ప్రాతినిధ్య సాధన కమిటీ చైర్మన్ మహ్మద్ షపి మాట్లాడుతూ అల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ 2024 ఎన్నికల్లో విడుదల చేసిన మ్యానిఫెస్టో ప్రకారం దివ్యాంగులకు రిజర్వేషన్ అమలు చేయ్యాలని డిమాండ్ చేశారు. మంత్రికి వినతిపత్రం సమర్పించిన వారిలో డి.మల్లికార్జున్, బి.యాదగిరి, శ్రీకాంత్‌రెడ్డి, మధుసూదన్, భాస్కర్, గణేష్ తదితరులు ఉన్నారు.

భవానీ ఎన్‌క్లేవ్ కాలనీ కమిటీ ఎన్నిక

వనస్థలిపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని భవానీ ఎన్‌క్లేవ్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నికైంది. నూతన అధ్యక్షులుగా పి.ప్రశాంత్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా రమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, టి.గాయత్రి జయపాల్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా కె.స్పందన, కోశాధికారిగా ఎం.ఎస్.బి చారి, ఇతర కమిటీ సభ్యులు ఎన్నికయారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు ప్రశాంత్‌గౌడ్ మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన కాలనీవాసులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేత

కొత్తపేట, జూలై 1(ఆంధ్రజ్యోతి): మోహన్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఎంపీపీ) బడి పిల్లలకు మంగళవారం ముత్తూట్ ఫైనాన్స్ మనేజర్ వై.లక్ష్మీనారాయణ 45 స్కూల్ బ్యాగులు అందజేశారు. కార్పొరేట్ షోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా సదరు సంస్థ స్కూల్ బ్యాగులు అందజేసింది. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ఆతీయ అధ్యక్షురాలు స్వరాజ్యలక్ష్మి, లయన్స్ క్లబ్ స్వచ్ఛభారత్ డిస్ట్రిక్ట్ 320డీ సెక్రెటరీ డా.బీ.విజయ్ వెంటకరంగ, పాఠశాల హెచ్ఎం ఆంజనేయులు, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ చైర్మన్ డా.టీ.సురేందర్, ఉపాధ్యాయులు సునీత, అరుణజ్యోతి, సంధ్య, అంజనాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలికి ఘనంగా వీడ్కోలు

మన్సూరాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ సందర్భంగా చివరిరోజు బాధ్యతలను చేపట్టిన బండ్లగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అన్నమ్మను విద్యార్థుల తల్లిదండ్రులు, బండ్లగూడ గ్రామస్థులు శాలువాలతో సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు. తన తల్లి ఉద్యోగ విరమణ సందర్భంగా అన్నమ్మ కుమార్తె డాక్టర్ స్మిత్ష, ఎయిర్ ఇండియాలో పైలట్‌గా విధులు నిర్వహిస్తున్న కుమారుడు తేజ్ ఇద్దరూ పాఠశాలలోని సుమారు 105 మంది విద్యార్థులకు వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.


భారీ సంఖ్యలో తరలివచ్చిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు

మన్నెగూడకు తరలివచ్చిన బీజేపీ శ్రేణులు

హయత్‌నగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్.రాంచందర్‌రావు నగర శివారు మన్నెగూడలోని వేదా కన్వెన్షన్‌లో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తుర్కయంజాల్ చౌరస్తా నుంచి కన్వెన్షన్ సెంటర్ వరకు భారీగా బీజేపీ జండాలను, హోర్డింగులను ఏర్పాటు చేశారు. ఉదయం 11.30 గంటలకు రాంచందర్‌రావు భారీ కాన్వాయ్‌తో తుర్కయంజాల్ మీదుగా వేదా కన్వెన్షన్‌కు చేరుకున్నారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్, రంగారెడ్డితో పాటు పలు జిల్లాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు.

బీజేపీ నూతన అధ్యక్షుడిని కలిసిన అఖిల్

చంపాపేట, జూలై 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరికంచిన రాంచందర్‌రావును చంపాపేట డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు ఆకుల అఖిల్ మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. రాంచందర్‌రావును కలిసిన వారిలో నాయకులు పి.ప్రదీప్‌కుమార్, విజయరాథోడ్, రాజేంద్రప్రసాద్, షకీల్‌మీర్జా, ఆలె నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన

వైద్య సేవలు అందించాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి


వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వనస్థలిపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచించారు. మంగళవారం వనస్థలిపురంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని కలెక్టర్ నారాయణరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వార్డులకు వెళ్లి రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రిలో వైద్యసేవలు, సదుపాయాలకు సంబంధించి అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానని, పని చేయాల్సిన బాధ్యత మీదే అన్నారు. వైద్యాధికారులు ఎక్కువ సమయాన్ని ఆస్పత్రికి కేటాయించాలని, ఆస్పత్రిలో సరిపడ ఆక్సిజన్ సరఫరా, ఆరోగ్యశ్రీ, ఓపీ సేవల్లో అంతరాయం కలగకుండా ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు తగిన పర్యవేక్షణ ఉండాలన్నారు. కాగా, ఆస్పత్రిలో సిటి స్కానింగ్ తో పాటు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించాలని పలువురు అధికారులు కలెక్టర్‌ను కోరగా వీలైనంత త్వరగా ఏర్పాటు చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. మరో నెలరోజుల్లో ఆస్పత్రికి వస్తానని, సూచించిన పనులన్నీ పూర్తి చెయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ నాగేందర్, అడిషనల్ డీఎంఏ డాక్టర్ వాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ త్రివేణి, తఖియుద్దీన్, ఆర్ఎంఓ, డాక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్పకాలనీలో సమస్యలు పరిష్కరిస్తా : సుధీర్‌రెడ్డి


అభివృద్ధి పనులపై అధికారులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో నాగోల్ డివిజన్ పరిధిలోని అయ్యప్పకాలనీ వరదనీటితో ముంపునకు గురవుతుండటంతో బాక్స్‌డ్రైన్ వేయించి పరిష్కరించామని, త్వరలోనే డ్రైనేజీ, రోడ్ల సమస్యలను సైతం పరిష్కరిస్తామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇరిగేషన్, వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి మంగళవారం ఎమ్మెల్యే అయ్యప్పకాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న డ్రైనేజీ, రోడ్ల సమస్యలను కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీ లోతట్టు ప్రాంతంలో ఉండటంతో ఎత్తు పల్లాలను చూసుకుని నూతనంగా డ్రైన్ నిర్మించాలని, ఈ పనులు పూర్తయిన వెంటనే సీసీ రోడ్లను సైతం వేయాలని అధికారులకు సూచించారు. యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని, కాలనీవాసులు ఏ మాత్రం చింతించొద్దని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు రమేష్‌బాబు, శ్రీనివాస్‌రెడ్డి, కనకయ్య, సతీష్, కాలనీవాసులు నరసింహాచారి, సతీష్ ఉన్నారు.

మొబైల్ షాపునకు కన్నం.. పాత నేరస్థుడి అరెస్ట్

- రూ.3.40లక్షల విలువైన 10 ఫోన్లు స్వాధీనం

చాదర్‌ఘాట్, జూలై 1(ఆంధ్రజ్యోతి): బిగ్ సీ మొబైల్ షాపునకు కన్నం వేసి విలువైన ఫోన్లను కాజేసిన వ్యక్తిని మలక్‌పేట క్రైం పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం సౌత్ ఈస్ట్ జోన్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ చైతన్యకుమార్ కేసు వివరాలు వెల్లడించారు. అస్సాం రాష్ట్రంలోని సోనాపూర్ ప్రాంత నివాసి రంజన్ దాస్(31) కొంత కాలంగా నాంపల్లిలోని నీలోఫర్ ఆస్పత్రి సమీపంలోని ఫుట్‌పాత్‌పై నివాసముంటున్నాడు. నగరంలోని మహంకాళి, మాసబ్ ట్యాంక్, ఐఎస్ సదన్ పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో ఇళ్లకు కన్నం వేసిన కేసుల్లో పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లాడు. జైలు నుంచి విడుదలైన రంజన్‌దాస్ దిల్‌సుఖ్‌నగర్‌లోని బిగ్ సీ మొబైల్ షాపునకు కన్నం వేసేందుకు ప్లాన్ చేశాడు. కొన్ని రోజులుగా షాపు వద్ద రెక్కీ నిర్వహించాడు. ఈ షాపు పక్కనుంచే మేడ పైకి వెళ్లేందుకు మెట్ల మార్గం ఉండడంతో అక్కడి నుంచి షాపులోకి వెళ్లేందుకు ఆదివారం అర్ధరాత్రి 12గంటల సమయంలో కన్నం వేశాడు. షాపులోకి ప్రవేశించి విలువైన 10 మొబైల్ ఫోన్లను చోరీ చేసి పారిపోయాడు. మొబైల్ ఫోన్లను బ్యాగ్‌లో చుట్టి తన వెంట పెట్టుకుని సంచరిస్తున్నాడు. షాపు నిర్వాహకుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుడు రంజన్ దాస్‌గా నిర్ధారించారు. నీలోఫర్ ఆస్పత్రి వైపు వెళ్తుండగా నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. తన వద్ద ఉన్న మొబైల్ ఫోన్ల బ్యాగ్ చూపించి తానే చోరీకి పాల్పడినట్లుగా రంజన్ దాస్ అంగీకరించాడని డీసీపీ వివరించారు. రూ.3.40లక్షల విలువ చేసే మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చోరీకి పాల్పడిన నిందితుడు రంజన్ దాస్‌ను 24 గంటల్లో పట్టుకున్న మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్, క్రైం ఇన్‌స్పెక్టర్ జయశంకర్, క్రైం ఎస్ఐ కిరణ్‌లాల్ జమాల్‌పూర్, అతని సిబ్బందిని డీసీపీ అభినందించారు.

స్కూటర్ డిక్కీలో నుంచి రూ.6.50లక్షలు చోరీ

- నిందితుడి అరెస్ట్.. నగదు స్వాధీనం

చాదర్‌ఘాట్, జూలై 1(ఆంధ్రజ్యోతి): స్కూటర్ డిక్కీలో నుంచి రూ.6.50లక్షల నగదును కాజేసి యువకుడిని చాదర్‌ఘాట్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం సౌత్ ఈస్ట్ జోన్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అదనపు డీసీపీ కె.శ్రీకాంత్, మలక్‌పేట ఏసీపీ సుబ్బిరామిరెడ్డితో కలిసి డీసీపీ చైతన్యకుమార్ కేసు వివరాలు వెల్లడించారు. సంతోష్‌నగర్ రియాసత్‌నగర్‌లోని ఒవైసీ కాలనీకి చెందిన మహ్మద్ వాజిద్(22) టాటా ఏస్ డ్రైవర్. మలక్‌పేట మార్కెట్‌లోని ఉల్లిగడ్డ వ్యాపారి షేక్ ఖుద్దూస్ వద్ద కొంతకాలం డ్రైవర్‌గా పనిచేసి మానేశాడు. సొంతంగా కారు కొనాలనే కోరికను తీర్చుకునేందుకు ఇదివరకు పనిచేసిన వ్యాపారి షేక్ ఖుద్దూస్ వద్ద డబ్బు చోరీ చేయాలని పథకం వేశాడు. సోమవారం ఉదయం వ్యాపారి తన స్కూటర్ డిక్కీలో రూ.6.50లక్షల నగదు పెట్టినట్లుగా గుర్తించిన మహ్మద్ వాజిద్ బుర్కా ధరించి మహిళ వేషధారణలో నగదును కాజేసి పారిపోయాడు. వ్యాపారి స్కూటర్ డిక్కీ నుంచి నగదు చోరీకి గురైనట్లు గుర్తించి చాదర్‌ఘాట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ బ్రహ్మ మురారీ క్రైం పోలీసులతో కలిసి సీసీ ఫుటేజీలను పరిశీలించి నగదు కాజేసిన వ్యక్తి మహ్మద్ వాజిద్‌గా నిర్ధారించుకున్నారు. ఒవైసీ కాలనీలోని తన నివాసంలో వాజిద్‌ను అరెస్టు చేసి రూ.6.50లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. సంఘటన జరిగిన 24గంటల్లోపు నిందితున్ని గుర్తించి పట్టుకున్న చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ బ్రహ్మ మురారీతో పాటు క్రైం సిబ్బందిని డీసీపీ చైతన్యకుమార్ అభినందించారు.

దృష్టి మళ్లించి.. రెండు సెల్‌ఫోన్లు చోరీ

- అరగంట వ్యవధిలో రెండు ఘటనలు

సైదాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి): బాధితుల దృష్టి మళ్లించిన ఆగంతకులు అరగంట వ్యవధిలో వేర్వేరు చోట్ల రెండు సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్లారు. సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. సైదాబాద్‌కు చెందిన మహ్మద్ అన్వర్(67) ఆదివారం సాయంత్రం 7గంటల సమయంలో సైదాబాద్ కాలనీ మెయిన్ రోడ్డుపై ఉన్న శ్రీ సాయి స్వగృహ ఫుడ్స్‌కు వెళ్లి లడ్డులు కొన్నాడు. దుకాణం బయటకు రాగానే బైక్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు 'మీ వెనుక జేబులో నుంచి డబ్బులు పడిపోయాయి' అని చెప్పారు. రోడ్డుపై పడి ఉన్న రూ.50ని వంగి తీసుకున్నాడు. కొద్దిసేపటికి అన్వర్ ఫోన్ చూసుకోగా కనిపించలేదు. బైక్‌పై వచ్చిన వ్యక్తులే ఫోన్ చోరీ చేశారని సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మరో ఘటనలో..

అక్బర్‌బాగ్‌కు చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి వనం నాగరాజు(65) ఆదివారం రాత్రి 8గంటల సమయంలో శంకేశ్వర్ బజార్‌లోని శివగంగ వైన్స్‌కు మద్యం కొనేందుకు వచ్చాడు. బైక్‌పై గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి 'క్యాష్ కౌంటర్ వద్ద మీ వెనుక జేబు నుంచి డబ్బులు పడిపోయాయి' అని చెప్పారు. అక్కడ కింద రూ.50 ఉండటం చూసి వంగి తీసుకున్నాడు. అనంతరం నారరాజు ఇంటికి వెళ్లి చొక్కా జేబులో చూడగా ఫోన్ కనిపించలేదు. దృష్టి మరల్చి ఫోన్ ఎత్తుకెళ్లినట్లు గుర్తించిన బాధితుడు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తుర్కయంజాల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా : రంగారెడ్డి


మునగనూర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

హయత్‌నగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని తుర్కయంజాల్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం తుర్కయంజాల్ మున్సిపాలిటి పరిధిలోని కొహెడా, తొర్రూర్, మునగనూరు, ఇంజాపూర్ గ్రామాల్లో సుమారు. రూ. 6 కోట్ల 7 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుర్కయంజాల్ మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని అన్నారు. మున్సిపాలిటీకి ప్రత్యేక నిధులు తీసుకు వచ్చి దశల వారీగా సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ అమరేందర్‌రెడ్డి, కొహెడా మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, నాయకులు కొత్త కుర్మ మంగమ్మ శివకుమార్, మల్‌రెడ్డి యాదిరెడ్డి, శివలింగంగౌడ్, గుత్త వెంకట్‌రెడ్డి, యశ్వంత్, నక్క శ్రీనివాస్ గౌడ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

పంజాగుట్ట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెన్షనర్ల సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలంగాణ జనసమితి (టీజేఎస్) అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. తెలంగాణ గవర్నమెంట్ విమెన్ పెన్షనర్స్ అసోసియేషన్ చైర్‌పర్సన్ ఆర్.ఉమాదేవి అధ్యక్షతన సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఆయనతోపాటు ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి, జాతీయ పెన్షనర్స్ ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ జయభారతి, తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ జేఏసీ అధ్యక్షుడు లక్ష్మయ్య, ఆల్ ఇండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ సుధాకర్, వివిధ సంఘాల నాయకులు రాజేందర్‌బాబు, పుల్లయ్య, వెంకట్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, చంద్రశేఖర్, తదితరులు మాట్లాడారు. పెన్షనర్లకు తన మద్దతు ఉంటుందని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. తాను కూడా పెన్షనర్‌ను అని, ఇందులో భాగస్వామ్యం అవుతానని అన్నారు. తాను ఉపాధ్యాయుడిగా వీఆర్ఎస్ తీసుకున్నానని ఇప్పటి వరకూ రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందలేదని ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి అన్నారు. ఒక్క నెల పెన్షన్ మాత్రమే అందుకున్నానని తెలిపారు. యూనియన్‌లు పోరాటం చేయాలని, ఒక పార్టీకి, ప్రభుత్వానికి అనుబంధంగా ఉండొద్దన్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో పెన్షనర్లకు నగదు రహిత వైద్య సేవలు అందేలా హెల్త్ కార్డులు ఇవ్వాలని, డీఏ ఇవ్వాలని, మహిళా పెన్షనర్స్ సంఘం నాయకులకు ఈహెచ్ఎస్ కమిటీలో ప్రాతినిధ్యం కల్పించాలని ఆర్.ఉమాదేవి డిమాండ్ చేశారు. సమావేశంలో పెన్షనర్ల జాతీయ, రాష్ట్ర సంఘాల నేతలు పాల్గొని మద్దతు తెలిపారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జాతీయస్థాయి పోరాటం చేసేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని వారు పిలుపునిచ్చారు. అసోసియేషన్ నాయకులు కె. ధనలక్ష్మి, ఎస్.ఎం.ఎల్ నాగమాంబ, నాగమణి రెడ్డి, భాగ్యలక్ష్మి, జి.లక్ష్మీ, డి.వరూధిని, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

మహాకాళి ఆలయంలో ఎల్లమ్మ కల్యాణం

ఓల్డ్‌మలక్‌పేట జూలై 1(ఆంధ్రజ్యోతి): ఓల్డ్‌మలక్‌పేటలోని చింతచెట్టు మహాకాళి దేవాలయంలో ఎల్లమ్మ తల్లి కల్యాణం మంగళవారం ఘనంగా జరిగింది. స్థానికులు పెద్దఎత్తున పూజాకార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. స్థానికులు ఎల్లమ్మతల్లికి బోనాలు సమర్పించారు. కల్యాణం అనంతరం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోచమ్మ ఆలయ ప్రతినిధులు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, చౌకి రవికుమార్, ఆకుల రాజు, శంకర్, సురేష్, ఉపేందర్, శైలజ, అశోక్, శ్రీనివాస్, విజయ్‌కుమార్, తదితరలు పాల్గొన్నారు.

ఎల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు


అమ్మవారి సన్నిధిలో కార్పొరేటర్ అరుణ

సైదాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం పురస్కరించుకుని మంగళవారం సైదాబాద్ చేపల మార్కెట్‌లో ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవిందర్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర నాయకులు రమణ్‌సింగ్ కార్యక్రమానికి హాజరయ్యారు. అసోసియషన్ సభ్యులు కాటేకర్ సుభాష్, దినేష్ గౌలికార్, ధర్మేందర్‌సింగ్, అవినాష్ నాయుడు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మను దర్శించుకున్న కార్పొరేటర్


రేణుకా ఎల్లమ్మను దర్శించుకున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, జూలై 1(ఆంధ్రజ్యోతి): మారుతీనగర్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు అశ్విన్‌సింగ్, వెంకట్‌రెడ్డి, తోట మహేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వారాహి దేవి నవరాత్రులు


ప్రత్యంగిరాదేవి పూజలో సిద్ధేశ్వరి పీఠ ఉత్తర పీఠాధిపతులు దత్తేశ్వరానంద భారతి మహాస్వామి

ఎల్‌బీనగర్, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురంలోని కుర్తాళపీఠం శ్రీ ప్రత్యంగిరా దేవి ఆలయంలో వారాహీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శ్రీ సిద్ధేశ్వరి పీఠ ఉత్తర పీఠాధిపతులు దత్తేశ్వరానంద భారతి మహాస్వామి సమక్షంలో అమ్మవారికి ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు. నవరాత్రులలో భాగంగా 18 రకాల ద్రవ్యాలతో అభిషేకం, అర్చనలు, సామూహిక కుంకుమార్చనలు, మహానక్షత్ర హారతులు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా పరిసర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు ప్రత్యంగిరాదేవి ఆలయాన్ని దర్శించుకుని వారాహీ నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్నారు. ఆలయ కార్యదర్శి మునిపల్లి శ్రీనివాస్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజాధికాల అనంతరం రామచందర్‌రావును మునిపల్లి శ్రీనివాస్ జ్ఞాపికతో సత్కరించారు. మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్ నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మునిపల్లె సువర్ణలత, నిఖిల్‌శర్మ, హేమంత్‌శర్మ, రామకృష్ణ, అరుణ, హేమ, సాయికుమార్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

- శ్రీవారాహి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆర్‌కేపురంకాలనీలోని శ్రీ అష్టభుజ వారాహి దేవి, శ్రీ మహా ప్రత్యంగిరా దేవి, శ్రీ శరభేశ్వర స్వామి వార్లను రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెద్దపూర సైదులు, విప్లవ్, కాళీదాస్, ఆలయ చైర్మన్ ములుగు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథస్వామి రథోత్సవం

చంపాపేట, జూలై 1(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ దేవస్థానంలో మంగళవారం జగన్నాథస్వామి రథోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీ త్రిదండి భక్తి సౌరభ్ మహారాజ్ ఆశిస్సులతో జగన్నాథస్వామి ఆలయంలో నిర్వహించిన భజన కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, ఈవో ఎస్.లావణ్య, ధర్మకర్తలు, భక్తులు పాల్గొని స్వామి వారికి పూజలు చేశారు. ఆలయంలోని జగన్నాథస్వామి, బలభద్రస్వామి, సుభద్రదేవి విగ్రహాలను రథంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, భక్తులు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

హయత్‌నగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై రెండు గేదెలు మృతిచెందిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. వివరాలు ఇలా ఉన్నాయి... తొర్రూర్ గ్రామానికి చెందిన మేకం నాగయ్యకు చెందిన రెండు గేదెలు గడ్డి మేసుకుంటు మంగళవారం సాయంత్రం మునగనూర్ టెలిఫోన్ కాలనీ సమీపానికి వెళ్లాయి. గతంలో ఎప్పుడో ఒక విద్యుత్ వైరు తెగి మర్రిచెట్టు పై నుంచి పడి ఉంది. దానికి విద్యుత్ సరఫరా అవుతుంది. అటూగా వెళ్లిన రెండు గేదెలకు వైరు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే చనిపోయాయి. వీటి విలువ సుమారు రెండు లక్షల రూపాయల వరకు ఉంటుందని రైతు నాగయ్య తెలిపారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని వేడుకున్నారు.

కుంట్లూర్ మారుతీనగర్‌లో దొంగల కలకలం

హయత్‌నగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కుంట్లూర్‌లోని రెండు ఖాళీ ఇళ్ల తాళాలను దొంగలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. హయత్‌నగర్ పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. కుంట్లూర్ నుంచి పెద్దఅంబర్‌పేట్‌కు వెళ్లే మార్గంలో ఉన్న మారుతినగర్‌లో కొండల్‌రెడ్డి అనే వ్యక్తి పై అంతస్తులో నివాసం ఉంటాడు. కింది పోర్షన్ ఖాళీగా ఉంది. గుర్తుతెలియని దుండగులు సోమవారం రాత్రి గేటు ఎక్కి వచ్చి ఇంటి తాళాలు ధ్వంసం చేసి ఇంట్లోకి ప్రవేశించారు. ఇంట్లో అంతా శోదించారు. ఏమీ లభించకపోవడంతో ఎదురుగా తాళం వేసి ఉన్న మరో ఇంటికి వెళ్లారు. తాళం పగులగొట్టి ఇంట్లోనికి ప్రవేశించారు. అక్కడ కూడా ఏమీ లభించక పోవడంతో దొంగలు వెళ్లిపోయారు. కాగా కొండల్‌రెడ్డి మంగళవారం ఉదయం కిందకు వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. అనుమానం వచ్చి అక్కడే ఉన్న సీసీ కెమోరాలను పరిశీలించగా గుర్తు తెలియని దుండగులు దొంగతనం కోసం వచ్చి గేటు ఎక్కి ఇంటి తాళాలు పగులగొట్టిన దృశ్యం కనిపించింది. కొండల్‌రెడ్డి వెంటనే 100కు ఫోన్ చేశాడు. హయత్‌నగర్ పోలీసులు మంగళవారం సాయంత్రం వెళ్లి పరిశీలించగా రెండు ఇండ్లు ఖాళీగా ఉన్నాయని పోలీసులు తెలిపారు. బుధవారం నుంచి నిఘాను మరింత పెంచుతామని సీఐ నాగరాజుగౌడ్ తెలిపారు. గతంలో ఇదే కాలనీపై చెడ్డిగ్యాంగ్ దాడి చేసి విలువైన వస్తువులు, నగదు, నగలు దోచుకుని పోయారు. దీంతో కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మార్కెటింగ్ ఉద్యోగి మృతి

కొత్తపేట, జూలై 1(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మార్కెటింగ్ ఉద్యోగి మృతిచెందాడు. ఎల్‌బీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మీర్‌పేట బడంగ్‌పేట సాయినగర్ కాలనీకి చెందిన గౌర సంపత్‌కుమార్(38) టైల్స్ మార్కెటింగ్ ఉద్యోగి. ఇతడు జూన్ 30న అర్ధరాత్రి దిల్‌సుఖ్‌నగర్ నుంచి ఎల్‌బీనగర్ వైపు బైకుపై వెళ్తున్నాడు. ఎల్‌బీనగర్ మెట్రోస్టేషన్ వద్ద గుర్తుతెలియని వాహనం సంపత్‌కుమార్ బైకును వెనుక నుంచి ఢీకొట్టి వెళ్లింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.